# రేపటి నిజం

-ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్

అప్పుడు రాత్రి ఏడు గంటలయ్యింది. నేను నా లాబ్‌లో పని చేస్తూ డిజిటల్ క్లాక్ వంక చూసాను. '11 ఏప్రిల్ 2109' రంగులలో మెరుస్తూ కనిపించింది. క్లాక్‌లో ఒక బటన్ నొక్కగానే నేను ఆరోజు చేయవలసిన పనులు, చేసిన పనులు టైముతో సహా ప్రత్యక్షమయ్యాయి. గత శతాబ్దంలో ఎన్నో వింతలు, విశేషాలు జరిగాయి. మానవుడు దాదాపు మృత్యువుని జయించాడు. ప్రతి మనిషి నూరు సంవత్సరాలు బ్రతకడం సర్వసాధారణం అయిపోయింది. మనిషి ఏదో ఏక్సిడెంట్‌లో చనిపోతే తప్ప సహజ మరణం అనేది ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు పొందే రోజు ఎక్కువ దూరంలో లేదనిపిస్తోంది.

గత యాభై సంవత్సరాలలో వివిధ గ్రహాలమీదకు మానవులు అనేకసార్లు వెళ్ళి వచ్చారు. చంద్ర మండలం మీద అయితే ఏకంగా కొన్ని నగరాలు నిర్మించారు. కొందరు అక్కడ శాశ్వత నివాసం ఏర్పరుచుకున్నారు. చుట్టు ప్రక్కల గ్రహాలకి ప్యాకేజి సైట్ సీయింగ్ టూర్లు సర్వ సాధారణమైపోయాయి.

నాకు మొదటనుంచీ కూడా విశ్వాంతరాళం, అంతరిక్షం అంటే ఆసక్తి ఎక్కువ. నేను ఆ విషయాలపై నా లాబ్‌లో నిరంతర పరిశోధనలు సాగిస్తూ ఉంటాను.

ఈ మధ్యనే అంగారక గ్రహానికి రెండు నెలలు టూర్ వెళ్ళి వచ్చాను. ఇదివరలో సంవత్సరాలు పట్టే ప్రయాణం ఇప్పుడు కొన్ని రోజులు మాత్రమే పడుతోంది.

నేను నా ప్రయోగాలకి అనువుగా ఉంటుందని ఎడారిలో మారుమూల ప్రాంతంలో లాబ్ కట్టుకున్నాను. అయినా అస్తమానూ ఏదో ఒక డిస్ట్రబెన్స్ కలుగుతూనే ఉంటుంది. నిజం చెప్పాలంటే అసలు భూమి మీద 'ఖాళీ', 'ప్రశాంతం' అనే పదాలకి అర్థం ఏనాడో కనుమరుగయిపోయింది.

నేను చేసే పరిశోధనలో ఎక్కువ భాగం సూర్యమండలానికి అవతల ఉన్న నక్షత్రాలు, గ్రహాలపై కేంద్రీకృతమై ఉంటుంది.

నేను రోజులాగే ఆ రోజు కూడా నా సూపర్ కంప్యూటర్ ముందు కూచుని పరిశోధన చేస్తున్నాను. ఈ విశాల విశ్వాంతరాళంలో ఎక్కడ ఏ వింత జరిగినా ఆ దృశ్యం నా కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. పూర్వకాలంలోలాగ 'ఫోకస్' చేయడం వంటివేమీ లేదు. టెలిస్కోప్ అన్ని విశేషాలు గ్రహించి కంప్యూటర్ స్క్రీన్‌మీద చూపిస్తుంది.

నా పరిశోధనలో నిమగ్నమైన నాకు, కంప్యూటర్ స్క్రీన్‌మీద కలలో కూడా ఊహించని వింత ఒకటి కనిపించింది.

ఏదో గోళం పోలిన ఆకారంతో వస్తువు ఒకటి శరవేగంతో నావైపు దూసుకువస్తోంది. కొన్ని సెకన్లలో నా ల్యాబ్ ఉన్న ఎడారి ప్రాంతమంతా పట్టపగలుగా మారిపోయింది. ఆ కాంతిని చూడలేక కళ్ళు మూసుకున్నాను.

శబ్దం చెవులు చిల్లులు పడేలా ఉండడంతో చెవులు మూసుకున్నాను. కొన్ని సెకన్లు గడిచేసరికి శబ్దం తగ్గింది. కాంతి కూడా తగ్గింది. నేను మెల్లగా కళ్ళు తెరిచాను. చెవులమీద చేతులు తీసేసాను.

నా ల్యాబ్‌కు దగ్గరలోనే ఒక నారింజ ఆకుపచ్చ రంగుల మిశ్రమంలో ఉన్న గుండ్రటి వాహనం ఆగివుంది. అందులోంచి ఏవో వింత జీవులు బయటకు వచ్చాయి. నా అదృష్టానికి ఆనందంతో తబ్బిబ్బయి పోయాను. గ్రహాంతర జీవులను ప్రత్యక్షంగా చూసే అవకాశం కలిగింది.

ఆశ్చర్యంగా ఆ జీవులు గోళాకార వాహనంలోంచి బయటకు అడుగుపెట్టగానే మండి, బూడిద అయిపోసాగాయి. లోపల ఉన్న జీవులు వింతగా, గోలగా అరవసాగాయి. నాకు ఆ జీవులు మాట్లాడే భాష అర్థం కావడంలేదు.

నేను వెంటనే నా దగ్గర ఉన్న మరొక సూపర్ కంప్యూటర్ ఆన్ చేశాను. ఆ కంప్యూటర్ కోట్ల కొలది భాషలను అర్థం చేసుకుని మన భాషలోకి అనువదిస్తుంది. అలాగే మనం మాట్లాడే మాటలు అవతలి వారి భాషను అనుసరించి, వారి భాషలోకి అనువదించి వినిపిస్తుంది.

నేను ఆ జీవులతో మాట్లాడే ప్రయత్నం చేసాను. కొంత సమయానికి మా మధ్య పరిచయాలు పూర్తి అయ్యాయి. ఆ జీవులు తాము భూమికి పది కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఒక గ్రహంనుంచి వచ్చామని తెలిపాయి. తాము భూగ్రహం మీద పరిశీలన చేసే బృందంలో సభ్యులమని అయితే ఇంకా భూమి గురించి చాలా విషయాలు తమకు ఇంకా అవగాహన కాలేదని, అందుకోసం ప్రత్యక్ష పరిశోధనకై భూమి మీదకు వచ్చామని తెలిపాయి.

అంతలో వాటిలో ఒక జీవి "మా వాళ్ళు ఇక్కడ వాతావరణంలోకి ప్రవేశించగానే బూడిద అయిపోతున్నారేమిటి? ఇక్కడ ఏయే వాయువులు ఉంటాయి? పీడనం ఎలా ఉంటుంది?" అని అడిగింది.

భూ గ్రహంమీద ఆక్సిజన్, నైట్రోజన్ వాయువులు ఎక్కువ నిష్పత్తిలో ఉంటాయని, పీడనం ఏ విధంగా ఉంటుందో చెప్పాను.

"ఆక్సిజనా?!" కీచుమని అరిచింది ఆ జీవి.

నేను ఆశ్చర్యపోయాను. నేను చెప్పిన దానికి


అంతగా ప్రతిస్పందించాల్సిన అవసరం, అంత గట్టిగా అరవాల్సిన అగత్యం ఏమిటో నాకు బోధ పడలేదు.

"బాబోయ్!? ఆక్సిజన్ ఉన్నచోట్ల జీవులుంటాయా?'' అని ఆశ్చర్యంగా అడిగింది ఆ జీవి.

నాకు మతిపోయింది.

"అంతలా ఆశ్చర్యపోతావేమిటి? దానికంత కంగారు దేనికీ?! అసలు మేము పీల్చేదే ఆక్సిజన్!'' అన్నాను నేను.

"ఏమిటీ?...ఆక్సిజనా?..పీలుస్తారా?.... అంత విషపూరిత వాయువును పీల్చి కూడా జీవులు బ్రతికుంటాయా?...నేను నమ్మను. మీరు అబద్ధం చెబుతున్నారు...అసలు ఆక్సిజను వాయువును లీటరులో లక్షోవంతు భాగం పీల్చినా సెకనులో మరణం సంభవిస్తుంది..బహుశా అందుకేనేమో మా శాస్త్రకారులు మీ భూవాతావరణంలోకి ప్రవేశించగానే మృత్యువు పాలయ్యారు...ఆక్సిజన్ వాయువు అత్యంత ప్రమాదకారి...పీలిస్తే మరణం...వాయువు ఉన్నచోట ప్రవేశిస్తే మండిపోవడం జరుగుతుంది''



నాకు అంతా అయోమయంగా ఉంది. నాకు తెలిసి ఏవో కొన్ని సూక్ష్మ జీవులు మినహాయిస్తే ఆక్సిజన్ అనేది జీవనాధారం. మరి ఇదేమిటి? ఆ జీవి దానికి పూర్తిగా విరుద్ధంగా మాట్లాడుతుందే?

గోళంలోని జీవి మళ్ళా ప్రశ్నించింది. "ఇక్కడ ప్రకృతిలో అమ్మోనియా ద్రవం అన్నా విరివిగా దొరుకుతుందా?''

మరలా ఆశ్చర్యపోవడం నా వంతయింది.

"అమ్మోనియా ద్రవమా? అదెందుకు? అయినా అది ప్రకృతిలో సహజంగా దొరకదు. దానిని మేము ప్రత్యేకంగా లాబ్‌లో తయారు చేస్తాం'' అన్నాను నేను.



"ఏమిటి ప్రకృతిలో సహజంగా దొరకదా? మరి మీరు ఏమి తాగి బతుకుతారు?" అని ఆశ్చర్యంగా అడిగింది ఆ జీవి.

"నీరు త్రాగుతాం!" అన్నాను నేను.

"నీరా? నీరు త్రాగుతారా? మీరు చెప్పేది నిజమా? నేను నమ్మను. నాలికమీద పడగానే ప్రాణం తీసే నీటిని తాగి జీవులు బతికి ఉండడం...నో..నో...నో..! ఇటీజ్ ఇంపాజిబుల్" పెద్దగా అరిచింది ఆ జీవి.

"మరి మీరు ఏమిటి తాగుతారు...?" అని అడిగాను నేను.

"అమ్మోనియా ద్రవం...బాబోయ్...నీరు తాగి బ్రతికుండే జీవులుంటాయని నా వెయ్యి సంవత్సరాల జీవితకాలంలో మొదటిసారి తెలుసుకున్నాను" అంది ఆ జీవి.

"ఏమిటి నీకు వెయ్యి సంవత్సరాలా?!" ఆశ్చర్యంగా అడిగాను నేను.

"అవును! మీ భూమిమీద మీరు లెక్కించే సంవత్సరాలతో పోలిస్తే నా వయస్సు వేయి సంవత్సరాలు. అయినా అందులో ఆశ్చర్యపడవలసినది ఏముంది? మా జీవితకాలం పది పన్నెండు వేల సంవత్సరాలు" తాపీగా అంది ఆ జీవి.

"ఆహా! మేము దాదాపు నూరు సంవత్సరాలు బ్రతుకుతాం" అన్నాను నేను.

"అంత తక్కువా?..అవునూ మీ జీవితకాలంలో కనీసం వందమంది పిల్లల్ని అయినా కంటారా?"

"నో..నో.. అసలు మా భూమిమీద స్త్రీలకు పదహారు, పద్దెనిమిది సంవత్సరాలు వచ్చేవరకూ సంతానం పొందే పరిస్థితిరాదు. నలభై, నలభై ఐదు సంవత్సరాల తరువాత పిల్లలు పుట్టడం కష్టం. పూర్వకాలంలో అయితే పది, పన్నెండు మంది పిల్లల్ని కనేవారుట. ఇప్పుడు కేవలం ఒకరినే కంటున్నారు..మరి మీ సంగతి!?"

"ఒక్కొక్కరూ కనీసం వెయ్యిమందిని కంటారు. అలా అయినా మా జనాభా మా గ్రహంలో వెయ్యోవంతు స్థలం కూడా ఆక్రమించుకోలేదు...అదిసరే అతి ప్రమాదకరమైన ఆక్సిజన్ పీల్చి, అత్యంత విషపూరితమైన నీటిని త్రాగి బ్రతుకగలుగుతున్నారంటే మీరు చాలా గొప్పవాళ్ళు...మరి మీ తిండి?" సందేహం వెలిబుచ్చింది ఆ జీవి.

"మేము కాయగూరలు, పళ్ళు ఫలాలు, చేపలు, మాంసం వగైరా తింటాం!" అంటూ ఫ్రిజ్‌లో ఉన్న ఆ వస్తువులు ఆ జీవికి చూపించాను.

"ఏమిటి అవి తింటారా? అసలు ఆక్సిజన్ పీల్చి నీరు త్రాగి అలాంటి తిండి తింటారు గనుకనే మీరు అల్పాయుష్కులు...మేమైతేనా రాళ్ళు, రప్పలు, అంతరిక్షంలోంచి నిత్యంపడే ఉల్కలు లాంటివి తింటాము. అందుకే అంతకాలం బ్రతుకుతాం...ఏది ఏమయినా...అమ్మో! మీ గ్రహానికి మా గ్రహానికి అసలు సంబంధం లేదు. మేము వెంటనే బయలుదేరాలి" అని అంది ఆ జీవి.

ఉత్తరక్షణం ఆ గోళాకార వాహనం రివ్వున ఎగిరిపోయింది.

నేనేదో అనబోయాను.

కానీ నా మాటలు వినిపించనంత దూరం వెళ్ళిపోయింది ఆ వాహనం. నాకు జరిగినదంతా ఒక కలలా అనిపించింది.

నేను గబగబా ఆ గోళాకార వాహనం అంతకుముందు ఆగిన ప్రదేశానికి పరిగెత్తాను. అక్కడ పడివున్న బూడిద, వాహన ఇంధనం తాలూకు అవశేషాలను జాగ్రత్తగా గ్రహించి నా ల్యాబ్‌లోకి తెచ్చాను. వాటిని క్షుణ్ణంగా పరీక్షించాను. ఆశ్చర్యం!! మనకు తెలిసిన మూలకాలు ఏవీ అందులో లేవు...అందులో మూలకాలు, వాటి సమ్మేళనమూ బొత్తిగా కొరుకుడు పడలేదు.

ఇంతకాలం నాకు భూమిమీద ఉండే నాలాంటి శాస్త్రజ్ఞులకు ఒక గట్టి నమ్మకం ఉండేది. అదేమిటంటే జీవులు బ్రతకడానికి ఆక్సిజను, నీరు అత్యావసరమని. ఇప్పుడు అవి లేకుండా కూడా జీవులు ఉంటాయని, అసలూ ఆ రెండూ లేకపోతే కొన్ని జీవులు మనగలవనీ తెలిసింది.

బహుశా మన భూగోళ పరిస్థితులలో అంటే ఇక్కడి వాతావరణం ఉష్ణోగ్రత, వాతావరణ పీడనం వగైరాలలో ఆక్సిజన్, నీరు జీవి మనుగడకు అవసరం. కానీ విభిన్న పరిస్థితులలో అవి అవసరం లేవేమో.

ఇంతకాలం, మనకు తెలిసినంతవరకూ, భూమిపై తప్ప ఈ విశ్వాంతరంలో ఎక్కడా ఆక్సిజన్, నీరు లేవనీ, అందుచేత విశ్వంలో ఎక్కడా జీవులు లేవని నమ్ముతూ వచ్చాం. కానీ ఆ సంఘటన తరువాత విశ్వాంతరాళంలో జీవులకోసం అన్వేషించడంలో కోణం మారిందనీ, మారాలనీ నాలాంటి శాస్త్రజ్ఞులకు తెలుస్తోంది.

★

## జెయింట్ కలువ ఆకులు

నెదర్లాండ్స్‌లో రాటర్‌డామ్ జ్యూలోని సరస్సులో ఎంత జెయింట్ కలువ ఆకులున్నాయంటే ఒక్కో ఆకు వ్యాసం మూడు మీటర్లు దాకా పెరుగుతుందిట. సందర్శకులు తమ చిన్నారి పిల్లల్ని ఆ ఆకులపై పడుకోబెట్టి సరదాగా ఫోటోలు తీస్తుంటారు. ఒక్కో ఆకు 15 కిలోల బరువును అవలీలగా భరించగలదట!

## ఈనాటికీ పావురాలతో బట్వాడా

దక్షిణాఫ్రికాలో టెలికామ్ అనే పెద్ద ఇంటర్నెట్ ప్రొవైడర్‌కి కూడా తమ సమాచారాన్ని ఒకచోట నుంచి మరోచోటకి పంపించటానికి సరిపడేంత 'ఎలక్ట్రానిక్ బ్యాండ్‌విడ్త్' లేక దాని మెమొరీ కార్డుని విన్‌స్టన్ అనే 11 నెలల పెంపుడు పావురంతో బట్వాడా చేసారుట!

## కలువల సముద్రం

జర్మనీలో ఎచేడే అనే చోట ఒక తోటమాలి తన వాటర్ నర్సరీలో కలువలని పండిస్తున్నాడు. జూన్-ఆగస్టు నెలల్లో ఆ సరస్సు ప్రతిరోజు ఆరు గంటలసేపు కలువల సముద్రంలా కన్నులవిందు చేస్తుందిట!

-తటవర్తి

